
అభ్యుదయం

RNI: TEL TEL /2019/12836

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో
నియోజక వర్గాల వారిగా
విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 24-10- 2026 సంపుటి : 6 సంచిక : 250 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి



- క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి
- డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యుల నియామకం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలి:
- బోయినపల్లి వినోద్ కుమార్

ఆరు నెలల వ్యవధిలోనే ఆర్థిక వినాశనం

2లో

- గ్యారెంటీల లెకలను కాగ్ నుంచే దాచిపెట్టిన రేవంత్ సరార్
- ఆర్థిక పరిస్థితిపై అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజుశ్రవణ్ డిమాండ్



లేనినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. జూలై దాకా కరువే!

- అప్పటికి సాధారణ వర్షపాతం నమోదైతేనే ఊరట
- రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులు
- ఎండాకాలం తాగడానికి చుక్కనీరు దొరక్కపోవచ్చు
- ఈ పరిస్థితిని దాచితే క్యాన్సర్‌లా తయారవుతుంది
- రానున్న ముప్పును ప్రజలందరికీ వివరించండి
- నాటి విపత్కరం కరోనా.. నేటి విపత్కరం ఎల్‌నినో
- కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు చేస్తున్న
- తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి
- సంక్రాంతి తర్వాత ప్రజలకు పని కల్పించేందుకు
- ప్రత్యేక ప్రణాళిక.. నేతలంతా గ్రామాలకు వెళ్లాలి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,
- కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, **అభ్యుదయం**

ఎల్‌నినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. వచ్చే ఏడాది జూలై వరకూ కొనసాగనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కరువు ప్రభావంతో రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నామని చెప్పారు. వేసవికాలంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయని, తాగటానికి చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి రాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిజాన్ని దాచి పెడితే క్యాన్సర్‌లా బాధపడాల్సి వస్తుందని,

మిగతా 2లో

టీఆర్ఎస్ మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్న నాయక్

- 15 ఏళ్ల మీడియా అనుభవానికి దక్కిన గుర్తింపు
- గిరిజన జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడిన నాయకుడికి కీలక బాధ్యత
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, **అభ్యుదయం**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బానోత్ వెంకన్న నాయక్ నియమితులయ్యారు. తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన వివిధ కమిటీల్లో భాగంగా ఆయనకు ఈ కీలక బాధ్యత అప్పగించారు.

గత 15 సంవత్సరాలుగా వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ జర్నలిజం రంగంలో విశేష అనుభవాన్ని సంపాదించుకున్న వెంకన్న నాయక్, గిరిజన జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. గతంలో ట్రైబల్ జర్నలిస్టు యూనియన్‌ను స్థాపించి గిరిజన జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం పలు పోరాటాలు నిర్వహించారు.

జర్నలిస్టుల సంక్షేమం, సామాజిక సమస్యలపై ఆయన చూపిన చొరవ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.తెలంగాణ రక్షణ సేన ఆవిర్భావం నుంచి సంస్థ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. గతంలో

- మిగతా 2లో పేజీలో

లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు



- కమలాపూర్ మండలంలోని 12 గ్రామాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పర్యటన
- వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఆర్థిక చేయూత

కమలాపూర్, **అభ్యుదయం**

వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి అందజేశారు. కమలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మండలంలోని భీంపల్లి, కన్నూరు,

మిగతా 2లో

రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లు.. అచ్చంపేట లిఫ్ట్‌కూ జలాలు

- శ్రీశైలం నుంచి అదనంగా 0.6 టీఎంసీల ఎత్తిపోతలు
- ప్రతిపాదనలు సిద్ధం చేయండి- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- త్వరలో మహారాష్ట్ర సీఎంతో భేటీ.. తమ్మిడిహట్టిపై చర్చలు



హైదరాబాద్, **అభ్యుదయం**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లను తరలించాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకాన్ని కూడా అక్కడి నుంచే చేపట్టాలని స్పష్టం చేశారు. రెండు లిఫ్ట్‌లకు కావాల్సిన

మిగతా 2లో



26న ఎన్టీఆర్ వర్సిటీ రూబీ జూబ్లీ వేడుకల

- దేశంలోనే తొలి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా గుర్తింపు
- 40 వసంతాలు పూర్తి
- హాజరు కానున్న ఉపరాష్ట్రపతి, గవర్నర్, చంద్రబాబు
- వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్

2లో

అభ్యుదయం
The Pride of Telugu national daily

నవంబరు నుంచి చింతలపూడి పనులు పునఃప్రారంభం

లక్ష్యంగా జల వనరుల శాఖ పనిచేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.. రాష్ట్రంలో గుర్తించిన 36 ప్రాధాన్య ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని, 2028 డిసెంబరు నాటికి అన్ని ప్రాజెక్టులనూ అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు, ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కాలువలపై సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. జల హారతి కార్పొరేషన్ ద్వారా జల వనరుల శాఖకు ఆదాయాన్ని సమకూర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోలవరం కాలువల ద్వారా నేవిగేషన్ వ్యవస్థ:

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో సాంకేతిక అంశాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం పనులు చేపట్టాలని, అత్యుత్తమ నిపుణులను నియమించి ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షించాలని సూచించారు. చారిత్రక ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నందున నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టులో ఇప్పటివరకు 90.2 శాతం సివిల్ పనులు పూర్తి అయినట్టు అధికారులు సీఎంకు వివరించారు. ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1, గ్యాప్-2 పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. నిపుణుల కమిటీ పలుమార్లు ప్రాజెక్టును సందర్శించి నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల పనులను 2027 మార్చి నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. కాలువల ద్వారా గరిష్ఠ స్థాయిలో నీటిని తరలించేలా వాటి సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ప్రాజెక్టు వద్ద నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జిని పూర్తి చేసి రాకపోకలతోపాటు పర్యాటక అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని సూచించారు. గోదావరి--పెన్నా అనుసంధానంపై కార్యాచరణ ప్రారంభించాలని, గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తరలించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రకాశం బ్యారేజికి ఎగువన, దిగువన వైకుంఠపురం, చోడవరం వద్ద ఆనకట్టల నిర్మాణం ద్వారా 14 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎత్తిపోతల పథకాలన్నీ క్రియాశీలంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాలువల వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు, భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం, విజయవాడ మీదుగా విశాఖపట్నం వరకు అంతర్గత జల రవాణాకు అవసరమైన నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ఆదేశించారు.

జలధార--జలహారతి నిరంతర కార్యక్రమం;

జలధార--జలహారతి రెండో దశ పనులను మార్చి 31 వరకు కొనసాగిస్తూ, 150 రోజుల కార్యక్రమంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం వీబీజీ రామ్ జీతో అనుసంధానం చేసి పనులు చేపట్టాలన్నారు. కొనసాగిస్తూ వర్షపు నీటిని ఒడిసి పట్టాలని, చెరువులు, రిజర్వాయర్లలో నీటి నిల్వలను పెంచాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా స్థూల వ్యవసాయ ఉత్పత్తి తగ్గకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే 36 ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు.

రిజర్వాయర్ నుంచే డిండి ప్రాజెక్టుకు నీళ్లు..
అచ్చంపేట లిఫ్ట్‌కూ జలాలు

0.6 టీఎంసీల జలాలను, అదనంగా శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఎత్తిపోసుకొనేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఇరిగేషన్ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రు లు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ఉన్నతాధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. తమ్మిడిహట్టి బరాజ్‌తోపాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటిపై చర్చించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉండాలని, త్వరలోనే చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవల తెలిపారని వెల్లడించారు. ఆ చర్చలకు సంబంధించిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఇటీవల ఢిల్లీలో సమావేశం సందర్భంగా



సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని అధికారులను ఆదేశించారు.

ఏదుల నుంచే డిండి, అచ్చంపేట లిఫ్ట్‌లు

డిండి ప్రాజెక్టుకు నీటిని నార్లాపూర్ నుంచి తీసుకోవాలా? ఏదుల నుంచి తీసుకోవాలా? అనే అంశంలో మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రతినిధుల మధ్య కొనసాగుతున్న వివాదాలు, అభ్యంతరాలు, విజ్ఞప్తులపై ఈ సమీక్షలో చర్చించారు. ఎక్కడినుంచి తరలిస్తే ఎంత ఖర్చవుతుంది? తదితర వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

గుండేడు, కాశింపల్లి, మర్రిపెల్లిగూడెం, మర్రిపల్లి, శనిగరం, గోపాలాపూర్, గూనిపర్తి, అంబాల, గూడూరు, శంభునిపల్లి గ్రామాల్లో పర్యటించి అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య చికిత్సల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేసి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద,

మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా వారి ఇళ్ల వద్దకే వెళ్లి చెక్కులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సాయం కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, మాజీ జడ్పీటీసీ నవీన్, ఇంద్రసేనారెడ్డి, సత్యనారాయణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలల వ్యవధిలోనే

ఆర్థిక వినాశనం



హైదరాబాద్, అక్టోబర్ 23 : రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలల వ్యవధిలోనే (ఏప్రిల్-సెప్టెంబర్ 2026) తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిందని, శాసనసభ సాక్షిగా చేసిన అంకెల గారడీ మొత్తం కాంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజా అర్ధవార్షిక నివేదికతో బట్టబయలైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అసమర్థ పాలన, అడ్డగోలు అప్పులతో ఖజానాను ఖాళీ చేసి, రాజ్యాంగబద్ధ ఆడిట్ సంస్థలకే తప్పుడు లెకలు చెప్తూ రాష్ట్రాన్ని దివాలా అంచున నిలబెట్టారని విమర్శించారు.'నాయకత్వానికి కావలసింది ప్రజలకు ఉపయోగపడే పదునైన ఆలోచనలు, అంతేకాని పసలేని రాజకీయ ఆరోపణలు కావు.

కొత్త ఆదాయ మార్గాలను వెతకకుండా, ఉన్న ఆస్తులను కరిగిస్తూ పోవడం వల్ల తెలంగాణ భవిష్యత్తుకు తీరని నష్టం జరుగుతుంది. ఇప్పటికైనా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంవైపు నెట్టకుండా నరైన నిర్ణయాలు తీసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయం పెంచే తెలివి లేక, ఉన్న ఆస్తులను కరిగించేస్తూ తెలంగాణ పిల్లల భవిష్యత్తును అప్పుల పాలు చేస్తున్నది' అని మండిపడ్డారు. సెప్టెంబర్ నెల కాగ్ నివేదిక విడుదలైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ లోపాలపై శుక్రవారం దాసోజు ఒక ప్రకటనల విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.6,857.76 కోట్ల రెవెన్యూ మిగులు సాధిస్తామని అసెంబ్లీలో డాంబికాలు పలికిందని, కానీ ఆరు నెలల్లోనే ఆ అంచనా పూర్తిగా తలకిందులై, ఏకంగా రూ. 15,096.18 కోట్ల భారీ రెవెన్యూ లోటులోకి రాష్ట్రం కూరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లేనినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. జూలై దాకా కరువే!

అందుకే దాచకుండా ప్రజలకు చెప్పాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్యనాయకులకు సూచించారు.

శుక్రవారం వారితో ప్రజాభవన్‌లో ఎల్‌నినో పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఢిల్లీలో ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీకి సన్నద్ధతపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై గత ఆరు నెలల నుంచీ ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. "ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలు చేస్తున్నడు. యూకేతో సహా ప్రపంచంలోని వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంది. ఒక్కో ఊరు.. ఒక్కో మండలం, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలాగా దీని ప్రభావం ఉండవచ్చు. తెలంగాణలోనే ఉత్తర తెలంగాణలో ఒకలాగా.. దక్షిణ తెలంగాణలో మరోలా ఉంది. ఏపీలో ఒకలా, మహారాష్ట్రలో మరోలా, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో ఇంకో రకంగా ఉంది. ఈ వంద దేశాలకు, ఇన్ని రాష్ట్రాలకు చెందిన వారంతా హరీశ్‌రావు కంటే తెలివి తక్కువోళ్లా? గత 75 ఏళ్లలో చూడని కరువు ఇది. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలూ ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్రలోని కచ్ ప్రాంతంలో ఇప్పటికే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.. అందులోనూ రేషన్ విధానం పెట్టారు. ప్రతి మనిషీ తన నీటి వినియోగం కనీసంగా 20 శాతం తగ్గించుకోవడం తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు" అని సీఎం రేవంత్ వివరించారు.

తాగునీటికీ కటకట తప్పదు..

ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి పెరిగి.. ఉన్న నీరు ఆవిరి అవుతూ ఉంటుందని, సాగునీటి మాట అటుంచి తాగునీటికీ కటకట ఏర్పడుతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించకుండా కరువు పరిస్థితిని ఎదుర్కొనడం అసాధ్యమన్నారు. అందుకే ఈ అంశాన్ని శాసనసభలో చర్చకు పెట్టడమే కాకుండా మంత్రివర్గ ఉపసంఘాన్నీ వేశామని తెలిపారు. గతంలో కరోనాపై కేసీఆర్ బాధ్యత లేని మాటల వల్లే వేలాది మంది చనిపోయారని రేవంత్ ఆరోపించారు. కరోనా వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ బాధ్యత లేకుండా వ్యవహరించారన్నారు.

"శాసనభలో కరోనాపై చర్చ సందర్భంగా 30 డిగ్రీల ఎండ కొడితే కరోనా చచ్చి ఊరుకుంటదని, ఎక్కువైతే పారాసిటమాల్ వేసుకుంటే పోతుందంటూ కేసీఆర్ దబాయించి మాట్లాడిండు. చివరకు ఏమైంది? లక్షల మంది చనిపోయారు. కరోనాతో చనిపోయిన వారిని దహనం, ఖననం చేయడానికి స్మశానాల్లో చోటు దొరకని పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్‌ను దైవాంశ సంభూతుడని బావించి.. కరోనాపై ఆయన బాధ్యత లేని మాటలను నమ్మి బయటికి వెళ్లినవారు స్మశానానికి వెళ్లారు. నమ్మని మనం.. ఇక్కడ సమావేశంలో కూర్చుని మాట్లాడుకుంటున్నం" సీఎం వ్యాఖ్యానించారు.

26న ఎన్టీఆర్ వర్సిటీ

రూబీ జూబ్లీ వేడుకల

అమరావతి, దేశ వైద్య విద్యారంగంలో ఒక చారిత్రక అధ్యాయాన్ని లిఖించిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం 40 ఏళ్ల మైలురాయిని పురస్కరించుకుని రూబీ జూబ్లీ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ ప్రతిష్ఠాత్మక ఉత్సవాలకు భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.
ఈ వివరాలను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం విజయవాడలో మీడియాకు వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటి ఆరోగ్య విశ్వవిద్యాలయంగా 1986 నవంబర్ 1న ఏర్పాటైన ఈ సంస్థ, 2026 నవంబర్ 1 నాటికి 40 వసంతాలు పూర్తి చేసుకోనుందని ఆయన తెలిపారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని, అక్టోబర్ 26వ తేదీ సోమవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో రూబీ జూబ్లీ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. గత నాలుగు దశాబ్దాలుగా లక్షలాది మంది వైద్యులను, ఆరోగ్య నిపుణులను దేశానికి అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి దక్కుతుందని వీసీ చంద్రశేఖర్ కొనియాడారు. 40 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్‌విశ్వ విద్యాలయం నాలుగు దశాబ్దాల ప్రస్థానం, సాధించిన విజయాలు, వైద్య విద్యారంగానికి అందించిన సేవలను ప్రతిబింబించేలా ప్రత్యేక సావనీర్‌ను ఆవిష్కరించనున్నట్లు వైస్ ఛాన్సలర్ వెల్లడించారు. ఈ చారిత్రక వేడుకలకు అనుబంధ కళాశాలల నుంచి వెయ్యి మందికి పైగా వైద్య విద్యార్థులు, వివిధ విభాగాల అధిపతులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రూబీ జూబ్లీ వేడుకలు విశ్వవిద్యాలయ చరిత్రలో చిరస్మరణీయంగా నిలవనున్నాయని ఆయన పేర్కొన్నారు.
కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్, పరిశోధన, అభివృద్ధి విభాగం డైరెక్టర్ డా. సూర్య ప్రభ,
ప్రచురణల విభాగం డైరెక్టర్ డా. కె. సుధ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలి

హనుమకొండ, అక్టోబర్ 23
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పట్టభద్రుల ఓటరు నమోదును పకడ్బందీగా చేపట్టాలని మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బోయినపల్లి వినోద్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో గ్రాడ్యుయేట్లను నేరుగా కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డివిజన్ల వారీగా ఎమ్మెల్సీ ఎన్నికల బాధ్యులను నియమించి, ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.
వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బోయినపల్లి వినోద్ కుమార్‌ను నియమించిన సందర్భంగా శుక్రవారం హనుమకొండలోని అలంకార్, కాకతీయ కాలనీలో ఉన్న ఆయన నివాసంలో సమావేశం నిర్వహించారు. మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలపై చర్చించారు.
ఈ సందర్భంగా బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు విషయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి, వారిని ఓటర్లుగా నమోదు చేయించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. పార్టీ తరపున పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

టీఆర్ఎస్ మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బానోత్ వెంకన్న నాయక్

జూబ్లీహిల్స్ జెండా పండుగ కార్యక్రమానికి అబ్జర్వర్‌గా కూడా ఆయనను కల్వకుంట్ల కవిత నియమించారు. మీడియా రంగంలో ఆయనకున్న అనుభవం, సంస్థ పట్ల నిబద్ధతను గుర్తించి తాజాగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.
నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా: వెంకన్న నాయక్
ఈ సందర్భంగా బానోత్ వెంకన్న నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మీడియా సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మీడియా అనేది ప్రజలకు, నాయకత్వానికి మధ్య వారధిగా పనిచేసే శక్తివంతమైన వ్యవస్థ అని పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ తెలంగాణ రక్షణ సేన బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

ప్రజల సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు సంస్థ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, ముఖ్యంగా గిరిజన జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

తన నియామకానికి సహకరించిన రూప్‌సింగ్ నాయక్, కిషన్ నాయక్, శ్రీకాంత్ గౌడ్, మాధవిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పాక్ పన్నాగాలకు భారత్ చెంపదెబ్బ...



'సొంత ఇల్లు చక్కదిద్దుకోలేని వాడు పక్కింటికి సుద్దులు చెప్పినట్లు' ఉంది పాకిస్థాన్ తీరు. అంతర్జాతీయ సమాజం ముందు ఏ ముఖం పెట్టుకుని భారత్‌పై బురదజల్లుతోందో అర్థం కాని రీతిలో దాయాది దేశం మరోసారి ప్రపంచ వేదికపై అడ్డంగా బుక్కైంది. ఐక్యరాజ్యసమితి వేదికగా మైనారిటీ హక్కుల ముసుగులో భారత్‌పై మొసలికన్నీరు కార్చబోయిన పాక్‌కు ఊహించని రీతిలో చెంపదెబ్బ తగిలింది.పాక్ బూటకత్వంపై విరుచుకుపడ్డ భారత్: ఐక్యరాజ్యసమితిలో మత స్వేచ్ఛ, అంత్యక్రియల హక్కులపై జరిగిన ఇంటరాక్టివ్ సంభాషణలో భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి భావికా మంగళానందన్ పాకిస్థాన్ దుష్ప్రచారాన్ని తుత్తునియలు చేశారు. సొంత గడ్డపై మైనారిటీల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న పాకిస్థాన్‌కు భారత్‌కు ఉపదేశాలు ఇచ్చే నైతిక హక్కు లేదని కుండబద్దలు కొట్టారు. మైనారిటీలను కంటికి రెప్పలా కాపాడటంలో ఘోరంగా విఫలమైన ఇస్లామాబాద్, ప్రపంచ వేదికలపై కల్లబొల్లి మాటలు చెప్పడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

అంతర్గత దౌర్భాగ్యంపై సూటి ప్రశ్నలు: పాకిస్థాన్‌లో హిందువులు, సిక్కులు, క్రైస్తవులు ఎదుర్కొంటున్న వేధింపులు, ఆరాధనా స్థలాల ధ్వంసం, మైనారిటీ బాలికల బలవంతపు మతమార్పిడులు నిత్యకృత్యంగా మారిన చేదు నిజాన్ని భారత్ ఎండగట్టింది. చివరికి అంత్యక్రియలు నిర్వహించుకునే కనీస మానవ హక్కు కూడా కల్పించలేని దేశం, ప్రపంచంలోనే అతిపెద్ద లౌకిక ప్రజాస్వామ్య దేశమైన భారత్‌ను వేలెత్తి చూపడం విడ్డూరమని భారత్ చురకలంటించింది.

ఏకాకిగా మారుతున్న పాక్: అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను అప్రతిష్టపాలు చేయాలని పాక్ పన్నుతున్న కుతంత్రాలు ప్రతిసారీ బూమరాంగ్ అవుతున్నాయి. భారత్ ఇచ్చిన తిరుగులేని కౌంటర్‌తో మరోసారి ఐరాసలో పాకిస్థాన్ తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పక్క దేశంపై విషం చిమ్మడం మాని, తమ దేశంలో అంతరించిపోతున్న మైనారిటీలను రక్షించుకోవడంపై దృష్టి పెట్టాలని భారత్ హెచ్చరించింది.

పట్టభద్రుల ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరిన కాంగ్రెస్..

ఇరు పార్టీల సమావేశం



ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవితో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటీ నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేని శంకర్, బాల నరసింహ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో మద్దతు, తదితర అంశాలపై ఇరు పార్టీల నేతలు చర్చిస్తున్నారు.

ఢిల్లీ విమానాశ్రయంలో 3 గంటల పాటు నిర్బంధం..

కేంద్రంపై పంజాబ్ సీఎం తీవ్ర ఆరోపణలు



ఢిల్లీ విమానాశ్రయ కస్టమ్స్ అధికారి మనీష్ కుమార్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు స్వయానా సొంత తమ్ముడని మాన్ ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కక్ష సాధించడానికే అధికారులు ఈ వేధింపులకు పాల్పడ్డారని, తన ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు.పారిస్‌లో జరిగిన ఒక ఆహార మహోత్సవంలో పంజాబ్ మార్క్‌ఫెడ్ స్టాల్‌ను సందర్శించడానికి తనకు మొదట అనుమతి నిరాకరించారని, ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాతే తాను అక్కడికి వెళ్లగలిగానని మాన్ తెలిపారు.విమానాశ్రయంలో తనిఖీలు, చలానా: పారిస్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఢిల్లీ విమానాశ్రయంలో తన లగేజీని దాదాపు రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీ చేశారని, కానీ ఎలాంటి అక్రమ వస్తువులు దొరకలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తనకు యాభై వేల రూపాయల జరిమానా (చలానా) విధించారని తెలిపారు.ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ, కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి వల్లే అధికారులు ఇలా వ్యవహరించారని ఆరోపించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన నాయకులే నియంతలా వ్యవహరించే సరికొత్త ధోరణి దేశంలో కొనసాగుతోందని మాన్ విమర్శించారు.ప్రజాస్వామ్య సంస్థల బలహీనత ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేస్తూ, దేశంలో కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే చరిత్ర పంజాబ్‌కు ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సమయాలకే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను రంగంలోకి దించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిని పట్టించుకోరని ఆరోపించారు. ఈ పరిణామాలన్నింటిపై విపక్షాల నుంచి కూడా విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

బీజేపీతో పొత్తు ఉండొచ్చు.. ఆప్, కాంగ్రెస్‌లు ప్రత్యర్థులే..

శిరోమణి అకాలిదళ్ నేత సుఖ్బీర్ సింగ్



పంజాబ్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నాయని శిరోమణి అకాలిదళ్ (ఎస్ఏడీ) అధ్యక్షుడు, మాజీ సీఎం సుఖ్బీర్ సింగ్ బాదల్ వెల్లడించారు. తాము ఎన్‌డీయేలో చేరొచ్చని తెలిపారు. శుక్రవారం పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో సుఖ్బీర్ సింగ్ భేటీ అయ్యారు. అనంతరం సుఖ్బీర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ పేరు నేరుగా ప్రస్తావించకపోయినా.. తమ పార్టీ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న వారితో కలిసి పని చేసేందుకు సిద్ధమన్నారు.ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ తమ రాజకీయ ప్రత్యర్థులే అంటూ వ్యాఖ్యానించారు. దీంతో మిగిలి ఉన్నది బీజేపీయే కాబట్టి.. ఆ పార్టీతో పొత్తు పెట్టుకునే అవకాశాలున్నట్లు పరోక్షంగా ప్రస్తావించారు. గతంలో అకాలిదళ్ పార్టీ ఎన్‌డీయే కూటమిలోనే ఉండేది. దీంతో ఈసారి కూడా ఆయన అదే కూటమిలో చేరుతారనే ప్రచారం కొంతకాలంగా జరుగుతోంది. పంజాబ్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తు పెట్టుకుని, అధికారం దక్కించుకోవాలని బాదల్ భావిస్తున్నారు. కొన్నేళ్లుగా ఎన్‌డీయేకు దూరంగా ఉన్న ఆయన ఇటీవల ఆ కూటమికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.గత ఆగష్టులో ఆయన ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. అప్పుడే ఆయన ఎన్‌డీయే వైపు చేరడం ఖాయమైందనే ప్రచారం జరిగింది. తాజాగా ఆప్, కాంగ్రెస్ పార్టీలు తమ ప్రధాన రాజకీయ ప్రత్యర్థులు అని ప్రకటించడం.. తమ సిద్ధాంతాలకు దగ్గరగా ఉండేవారితో పొత్తు పెట్టుకుంటాం అని చెప్పడం ద్వారా బీజేపీతో పొత్తుపై ప్రకటన చేసినట్లు అర్థమవుతోంది. 2020లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి నుంచి అకాలిదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత చివరగా 2022లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేసి ఓడిపోయింది.

పోలీసుల సమక్షంలోనే వైద్యురాలిపై దాడి..

- ఆమె చెంపపై కొట్టిన వ్యక్తి



ముంబై: ఒక కేసులో నిందితుడైన వ్యక్తిని వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తీసుకెళ్లారు. అయితే వైద్య పరీక్షల తర్వాత ఆ వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడు. వైద్యురాలి చెంపపై అతడు కొట్టాడు. అప్రమత్తమైన పోలీసులు ఆ వ్యక్తిని పట్టుకుని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం సాయంత్రం తలేగావ్ శ్యామ్‌జీపంత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక వ్యక్తిని పోలీసులు తీసుకువచ్చారు. మెడికో లీగల్ కేసులో నిందితుడైన అతడికి వైద్య పరీక్షలు చేయించారు.కాగా, వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత సంబంధిత పత్రంపై వైద్యురాలు సంతకం చేశారు. నిందితుడైన ఆ వ్యక్తి కూడా ఆ పత్రంపై సంతకం చేశాడు. ఆ తర్వాత పోలీసులు పక్కనే ఉన్నప్పటికీ వైద్యురాలి చెంపపై అతడు కొట్టాడు. వెంటనే స్పందించిన ఒక పోలీస్, ఆ వ్యక్తిని పట్టుకుని ఆ రూమ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించి ఆ వ్యక్తిపై మరో కేసు నమోదు చేశారు

. ఒక మహిళపై బ్లేడుతో దాడి చేసిన కేసులో అతడు నిందితుడని పోలీస్ అధికారి తెలిపారు.అయితే వైద్యురాలిపై ఆ వ్యక్తి ఎందుకు దాడి చేశాడో అన్నది తెలియలేదు. ఆ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు, వైద్య సిబ్బంది ఈ సంఘటనను ఖండించారు. నిరసనగా కొంతసేపు వైద్య సేవలను నిలిపివేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు.. శశీ థరూర్ కౌంటర్



కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై బీజేపీ దృష్టి సారించింది కాబట్టే ఆయనను చెడ్డ వ్యక్తిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అన్నారు. ఓ విఫల వ్యక్తి విజయం కోసం కాంగ్రెస్ పదే పదే ప్రయత్నిస్తోందన్న ప్రధాని కామెంట్స్‌పై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ యువ ఓటర్లలో రాహుల్ గాంధీ నూతన ఉత్తేజాన్ని రాజేశారని శశిథరూర్ వ్యాఖ్యానించారు. బీజేపీ ఈ విషయాన్ని గుర్తించాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉందని అన్నారు. పార్టీకి భిన్నమైన అభిప్రాయాలను తానూ అనేక సార్లు వ్యక్తం చేశానని చెప్పారు. కానీ పార్టీలో ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుసరించే విధానాలు, సిద్ధాంతాలు దేశాభివృద్ధికి అనుగుణంగా ఉంటాయని ఎంపీ శశీథరూర్ తెలిపారు. అందుకే తాను పార్టీ విధానాలకు మద్దతు ఇస్తున్నానని చెప్పారు. బీజేపీతో ఢీ అంటే ఢీ అనేందుకు తాము సంసిద్ధంగా ఉన్నామని అన్నారు.

అంతకుముందు ప్రధాని మోదీ రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'తన విఫల ఉత్పత్తి కోసం యావత్ దేశాన్ని కాంగ్రెస్ ఇంకా ఎంత కాలం పణంగా పెడుతుందో నాకు అర్థం కావట్లేదు. తమ నేతను లాంఛ్ చేసేందుకు కాంగ్రెస్ చేసినన్ని ప్రయత్నాలు శ్రీహరికోటలో (రాకెట్ ప్రయోగ కేంద్రం) కూడా జరిగి ఉండవు' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు..!

హైదరాబాద్, అక్టోబరు 23 : తెలంగాణ ప్రభుత్వం ఇక నుంచి ఇంటి వద్దకే మీ సేవా, ఆధార్ సేవలు తీసుకువచ్చేందుకు సిద్ధమవుతోంది. అలాగే, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దే పొందే అవకాశం కల్పించనుంది. ఆధార్ నమోదు, వివరాల అప్‌డేట్ సేవలు కూడా ఇంటి వద్దకే తీసుకురానున్నట్లు తెలుస్తోంది. మీ సేవా డోర్‌స్టెప్ ద్వారా డెలివరీకి తొలి నెలలోనే అపూర్వ స్పందన వచ్చింది.1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు 3,885 కాల్స్, 1100కు కాల్ చేసి లేదా మీ సేవా పోర్టల్ ద్వారా సేవలు బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలుపుతున్నారు. క్యూల్లో నిలబడే అవసరం లేకుండా ఇంటి వద్దే సేవలు తీసుకువచ్చేలా కసరత్తు చేస్తోంది.

ప్రస్తుతం జఖ=ఙు పరిధిలోని ప్రాంతాల్లోనే డోర్‌స్టెప్ సేవలు ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. బుక్ చేసుకున్న సేవల ఆధారంగా నిర్దేశిత రుసుములు చెల్లించాలనే షరతును విధించనుంది. తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఈ సేవలను రాష్ట్ర ప్రభుత్వం బలోపేతం చేస్తోంది.

క్యాంపస్ ఈవెంట్లకు భద్రతా చట్టం.

'తెలంగాణ ఈవెంట్స్ సేఫ్టీ బిల్

- ఎంవీఎస్ఆర్ ఘటనతో సర్కార్ అప్రమత్తం
- భారీ కార్యక్రమాలకు కఠిన నిబంధనలు
- భద్రతా ప్రమాణాలపై ఉన్నత విద్యామండలి దృష్టి
- విద్యార్థుల ప్రాణాలే ముఖ్యమని భావిస్తున్న ప్రభుత్వం



హైదరాబాద్, అక్టోబర్ 23 : విద్యాబోధనకు నిలయాలుగా ఉండాల్సిన యూనివర్సిటీలు, కళాశాలల క్యాంపస్‌లు.. భారీ ఈవెంట్లు, డీజే పార్టీలు, సినిమా షూటింగ్‌లకు వేదికలవుతున్నాయి. వార్షికోత్సవాలు, గ్రాడ్యుయేషన్ డేలు, సాంస్కృతిక వేడుకల పేరుతో పెద్ద సంఖ్యలో విద్యార్థులను సమీకరిస్తున్నా.. వారి భద్రతకు తగిన ఏర్పాట్లు ఉంటున్నాయా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వినోదం, ప్రచారం, హంగులపై చూపుతున్న శ్రద్ధ.. విద్యార్థుల ప్రాణాలను కాపాడే భద్రతా ఏర్పాట్లపై కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల్లో నిర్వహించే కార్యక్రమాలకు కఠిన భద్రతా ప్రమాణాలు నిర్దేశించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో 'తెలంగాణ ఈవెంట్స్ ఫెసిలిటేషన్ అండ్ సేఫ్టీ బిల్ -- 2026' ముసాయిదా రూపకల్పనపై కసరత్తు జరుగుతోందని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆమోదంతో చట్టం తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు వెల్లడించారు.

భూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

● జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయిలి

● రత్నగిరిలో భూ రీసర్వే పనుల పరిశీలనలి

● భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యమని వెల్లడి







లిభీమదేవరపల్లి, అక్టోబర్ 23 భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
రోవర్ సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న భూముల కొలతలను పరిశీలించిన కలెక్టర్, గ్రామంలో ఇప్పటివరకు ఎన్ని ఎకరాల భూమిని సర్వే చేశారని, ఇంకా ఎంత విస్తీర్ణంలో సర్వే పూర్తి చేయాల్సి ఉందని భూముల కొలతల శాఖ ఏడీ నూర్‌సింగ్, సర్వేయర్ విజయభాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో పొరుగు భూముల రైతులు హాజరవుతున్నారా, భూముల హద్దులను రైతులు స్వయంగా చూపిస్తున్నారా అనే అంశాలపై ఆరా తీశారు.
అనంతరం గ్రామంలోని వరి పంటలను పరిశీలించిన కలెక్టర్, సాగవుతున్న పంటలు, వాటి ప్రస్తుత పరిస్థితులపై రైతులతో మాట్లాడారు. వ్యవసాయానికి ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా అవుతోందని ఏఈఈ లక్ష్మణ్ నాయక్‌ను ప్రశ్నించారు. సబ్‌స్టేషన్ పనులు, విద్యుత్ మరమ్మతుల వివరాలను తెలుసుకున్నారు. రబీ సీజన్‌లో సాగు చేయనున్న పంటలపై రైతులు, ఏఈఓ నాగరాజుతో చర్చించగా జొన్న పంట సాగు చేయనున్నట్లు తెలిపారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రీసర్వే ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భూముల కొలతల్లో పారదర్శకత పాటిస్తూ సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీసర్వే విజయవంతానికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తిరుమల, నాయబ్ తహసీల్దార్ సూర్య, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

సింగరేణి జీఎం కార్యాలయంలో ఓటరు నమోదుపై అవగాహన

నవంబర్ 6 వరకు గడువు ఉందని వెల్లడి







భూపాలపల్లి, అక్టోబర్ 23 వరంగల్--ఖమ్మం--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కోరారు. శుక్రవారం భూపాలపల్లి సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన జీఎంతో పాటు ఉద్యోగులను కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు నవంబర్ 6 వరకు గడువు ఉందని, అర్హులైన వారు చివరి తేదీ వరకు వేచి చూడకుండా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
ఇందులో భాగంగా భూపాలపల్లి అంబేద్కర్ స్టేడియంలో మార్నింగ్ వాకర్స్‌ను, సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌తో పాటు పట్టణంలోని 5, 6, 7, 24వ వార్డుల్లో ప్రజలను కలిసి అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో సుమారు ఐదు వేల మంది పట్టభద్రులు ఓటరుగా నమోదైనట్లు సమాచారం ఉందన్నారు. గతంతో పోలిస్తే నమోదు సంఖ్య తక్కువగా ఉందని, ఇంకా ఎక్కువ మంది నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గండ్ర విజ్ఞప్తి చేశారు. జీఎం కార్యాలయ ఉద్యోగులు ఓటరు నమోదు కార్యక్రమంపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

96 ఏళ్ల బామ్మ చిరకాల కోరికకు కేటీఆర్ భరోసా

● కేసీఆర్‌ను కలవాలన్న దుగ్గిదేవర సామ్రాజ్యం ఆకాంక్ష

● చొరవ చూపిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

● సామ్రాజ్యంను సత్కరించిన కేటీఆర్.. సమాజ సేవలో రాణిస్తున్న మనవడికి అభినందనలు



హైదరాబాద్, అక్టోబర్ 23
ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరం గ్రామానికి చెందిన 96 ఏళ్ల వృద్ధురాలు దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కోరికను నెరవేర్చేందుకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర చొరవ చూపారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రత్యక్షంగా కలిసి ఆయనతో ఫొటో దిగాలన్న సామ్రాజ్యం ఆకాంక్షను తెలుసుకున్న ఎంపీ రవిచంద్ర ఆమెను శుక్రవారం తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సమావేశపరిచారు.మల్లవరం గ్రామ సర్పంచ్‌గా రెండుసార్లు, ఎంపీటీసీగా రెండుసార్లు, సింగిల్ విండో డైరెక్టర్‌గా పనిచేసిన సామ్రాజ్యం గ్రామ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్ అంటే ఆమెకు ఎంతో అభిమానం. ఆయనను ఒక్కసారైనా ప్రత్యక్షంగా కలవాలన్నది ఆమె చిరకాల కోరిక.ఈ విషయాన్ని సామ్రాజ్యం పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన రవిచంద్ర ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్ కుమార్, మనవళ్లు యుధిష్టర్, శ్రీరఘునందన్‌లతో కలిసి తెలంగాణ భవన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించారు. త్వరలో కేసీఆర్‌ను కలిసే అవకాశం కల్పించి ఆమె చిరకాల కోరికను నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చిన్న వయసులోనే సమాజ సేవ.. శ్రీరఘునందన్‌కు కేటీఆర్ అభినందనలు

సామ్రాజ్యం మనవడు, అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ చిన్నతనం నుంచే సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం బెంగళూరులో బీబీఏ చదువుతున్న ఆయన 2016 ఫిబ్రవరి 17న కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తన తొమ్మిదేళ్ల వయసులోనే మల్లవరం ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకున్నారు.

ఏజెన్సీ గీత కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలి: గుండెబోయిన రవిగౌడ్
ఏజెన్సీ కల్లుగీత సొసైటీలను పునరుద్ధరించాలని డిమాండ్
లిసర్వాపూర్‌లో ఘనంగా కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాలు



ములుగు, అక్టోబర్ 23 ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన రవిగౌడ్ డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి నిలబెట్టుకోవాలని కోరారు. కల్లుగీత కార్మిక సంఘం 69వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ములుగు మండలం సర్వాపూర్ గ్రామంలో సొసైటీ అధ్యక్షుడు గుండెబోయిన శ్రీహరిగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకుడు బాలసాని కనుకయ్యగౌడ్ సంఘం జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవిగౌడ్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో కల్లుగీత కార్మికులు సంక్షేమ పథకాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలకు తెగించి తాటి చెట్లు ఎక్కుతున్న కార్మికులు ప్రమాదాలకు గురైనా సరైన పరిహారం అందడం లేదని ఆరోపించారు. కనీసం వృత్తి పింఛన్లు కూడా అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఏజెన్సీ గీత కార్మికులను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారా అని ప్రశ్నించారు.
ఎన్నికల సమయంలో ఏజెన్సీ కల్లుగీత సొసైటీలను పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిపై తగిన చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి వెంటనే కల్లుగీత కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి సొసైటీల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు జీవో 350 ప్రకారం వృత్తి పింఛన్లు మంజూరు చేయాలని, చెట్లపై నుంచి పడి ప్రమాదాలకు గురైన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు బీమా తరహాలో గీత కార్మికులకు ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి సొసైటీకి భూమి కొనుగోలు పథకం కింద పది ఎకరాల భూమి సమకూర్చాలని, వృత్తిలో ఉన్న కార్మికులందరికీ కాటమయ్య రక్షణ కిట్లు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు మొడెం జగపతిగౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన భిక్షపతిగౌడ్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, గుండెబోయిన మహేందర్‌గౌడ్, బాలసాని సురేష్‌గౌడ్, మొడెం రవీందర్‌గౌడ్, మొడెం రాజుగౌడ్, గుండెబోయిన నరేందర్‌గౌడ్, మొడెం సారంగంగౌడ్‌తో పాటు పలువురు గీత కార్మికులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలను చైతన్యపరచాలి

● రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు
● పాల్గొన్న భూపాలపల్లి డీపీఆర్వో శీలం శ్రీనివాస్, సాంస్కృతిక సారథి కళాకారులు



హైదరాబాద్, అక్టోబర్ 23 ల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షపాత లోటు, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి పరిస్థితులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార పౌర సంబంధాల శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ప్రజలకు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడంలో జిల్లా పౌర సంబంధాల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కళాజాతాలు, పాటలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, తాగునీటి వినియోగంలో జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరచాలని పేర్కొన్నారు.ఎల్‌నినో కారణంగా వివిధ రంగాల్లో ఎదురయ్యే సంభావ్య సమస్యలు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై విద్యుత్, మిషన్ భగీరథ, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములై నీరు, విద్యుత్ పొదుపును దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.

అభ్యుదయం
The Pride of Telugu national daily

రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలి

నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్





దేవరకొండ రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో కోరారు.

గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు ,ఇతరత్రా నీటి వృధా లేకుండా నివారించి నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు.శుక్రవారం దేవరకొండా లోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం- తీసుకోవలసిన చర్యలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజర య్యారు.ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు, వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకుని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

నీటి సంరక్షణ చర్యలలో భాగంగా గ్రామాలలో పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, సాగునీటికి ఎంత అవసరమో అంతే వినియోగిస్తూ నీటి పొదుపు సూత్రాలను ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు.

విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు.రానున్న రోజుల్లో తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన సజ్జలు, జొన్నలు, మినుములు, కందులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సుమారు 30 మంది రైతులు ఒక సమూహంగా ఏర్పడి సమిష్టి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పని కల్పించాలని, పశుసంపదను సంరక్షిస్తూ పశువులకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామాలలో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చేపట్టిన పనులకు కొలతల పుస్తకాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గ్రామీణ ప్రజలకు అవసరమైన రేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కొత్త పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రకృతి వైపరీత్యంగా భావించి, సమష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సర్పంచులతో కలిసి క్రింద కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నివారణ, నీటి పొదుపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తి యాన్ మావి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ , పశు సంవర్ధక శాఖ అధికారి జివి రమేష్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఇంచార్జ్ఎంపీడీవో పార్వతి, అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు .

రైతుల వద్దకు వెళ్లి భూ సమస్యలను పరిష్కరించాలి

భూ సర్వే వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలి

మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలి

నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





దేవరకొండ రైతుల భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పశువుల ద్వారా గోబర్ గ్యాస్ తయారీని ప్రోత్సహించాలని తెలిపారు. శుక్రవారం ఆయన దేవరకొండ నియోజ కవర్గంలోని చందంపేట మండలం, పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో భూ సర్వే నిర్వహించిన ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందే క్షేత్రస్థాయికి చేరుకున్న ఆయన రైతులతో నేరుగా మాట్లాడి భూ సర్వే వివరాలు, భూముల విస్తీర్ణం, రికార్డులు, అభ్యంతరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

పొగిళ్ల గ్రామంలో సర్వే నంబర్ 2లో 1,066 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో వాస్తవంగా సాగులో ఉన్న భూమి, అసైన్డ్ భూములు , భూములపై హక్కులు కలిగిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేకు సంబంధించిన వివరాలను గ్రామంలో ప్రదర్శించాలని, అవసరమైతే గ్రామసభలో చదివి వినిపించాలని ఆదేశించారు.ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలు , వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలేమిటని అధికారులను ప్రశ్నించారు. మొత్తం 30 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపా రు. భూముల రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని సరిపోల్చి పరిశీలించాలని సూచించారు. భూములపై అభ్యంతరాలు వ్యక్తం చేసే రైతులు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాలని తెలిపారు.

అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా అమ్మడం, కొనడం చేయకూడదని స్పష్టం చేశారు. సర్వే వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేసి, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.రైతులతో చర్చించి భూ సమస్యలను పరిష్కరించేందుకుకంబాలపల్లి రైతు వేదికలో రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సర్వే నంబర్ల వారీగా భూ సర్వే ఎంతవరకు పూర్తయింది, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా, ఇంకా ఎన్ని సర్వేలు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సర్వే నంబర్ 37, 50లకు సంబంధించిన సర్వే వివరాలను పరిశీలించి, పూర్తయిన సర్వే వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు, పహాణీలో నమోదైన పేర్లు, వాస్తవంగా భూములు అనుభవిస్తున్న రైతుల వివరాలను సరిపోల్చాలని ఆదేశించారు. వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.

భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, రికార్డుల్లో తేడాలు కనిపించినా సంబంధిత రైతులు, అధికారులు కలిసి చర్చించుకోవాలని సూచించారు. అన్నదమ్ములు, ఇతర భూహక్కుదారుల మధ్య సమస్యలు ఉంటే పరస్పరం కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని అన్నారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నవారికి నిబంధనల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని,ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, వర్షాలపై ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాలు తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటలకు అవసరమైన నీటిని మాత్రమే వినియోగించాలని, ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని తెలిపారు.నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకొని తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, కూరగాయల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పశుసంపదను కాపాడుకుంటూ, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని అన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలనిగ్రామాల్లో అందుబాటులో ఉన్న బంజరు భూములను ఉపయోగించుకొని మహిళా సంఘాలు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా మహిళా సంఘాలు ఆదాయాన్ని పెంచుకొని ఆర్థికంగా బలోపేతం కావచ్చని తెలిపారు.

అలాగే పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారు చేసుకొని ఇంధన అవసరాలను తీర్చుకోవడంతో పాటు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, గ్రామీణ ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకొని, పొదుపు అలవాటును పెంపొందిం చుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పోలీసుల విధులపై విద్యార్థులకు అవగాహన

- గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

- పోలీసుల పనితీరు, విధి నిర్వహణలో ఉపయోగించే పరికరాలపై వివరణ



గట్టుప్పల్,, అక్టోబర్ 23:

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గట్టుప్పల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్సై సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గట్టుప్పల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పనితీరు, పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసుల విధులు.. పరికరాల వినియోగంపై వివరణ పోలీస్‌స్టేషన్‌లో విధులు ఎలా నిర్వహిస్తారు? ఫిర్యాదులు అందినప్పుడు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు? అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. విధి నిర్వహణలో పోలీసులు ఉపయోగించే వివిధ పరికరాలను పరిచయం చేసి, వాటి వినియోగం, ప్రాధాన్యాన్ని తెలియజేశారు. పోలీసుల దైనందిన విధులు, నేరాల నియంత్రణ, ప్రజల రక్షణలో పోలీస్‌శాఖ పోషించే పాత్రను వివరించారు.పోలీసులపై అవగాహన.. సమాజంపై బాధ్యత ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్‌శాఖ పనితీరుపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. పోలీసుల విధులు, ఎదురయ్యే సవాళు , సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు వారు చేసే కృషిని తెలుసుకునే అవకాశం కల్పించారు. చిన్నతనం నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని, సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు పెంపొందిం చడంతోపాటు విద్యార్థుల్లో పోలీస్‌శాఖపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సుదర్శన్, స్వరూప్ సింగ్, నందిని, తదితరులు ఉన్నారు.

వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

పోలీసు అమరవీరుల త్యాగాలు, పోలీస్ స్టేషన్ పనితీరుపై విద్యార్థులకు అవగాహన





/అక్టోబర్ 23/నల్గొండ జిల్లా ప్రతినిధి :శంకర్ పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములపల్లి పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల త్యాగాలు, ప్రజల రక్షణలో పోలీసులు నిర్వహించే విధుల గురించి ఎస్ఐ వి సురేష్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, స్టేషన్ రైటర్ గది, ఎస్‌హెచ్ఓ గది, పాపిలాన్ పరికరం, సీసీ కెమెరాల పనితీరుతో పాటు అల్లర్ల నియంత్రణకు ఉపయోగించే రక్షణ పరికరాలను విద్యార్థులకు పరిచయం చేశారు. పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రను వివరించి, పోలీసుల సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశం ఇచ్చారు.

చౌటకూర్‌లో ఘనంగా అలయ్ బలయ్

ఆందోల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.3 వేల కోట్లకు పైగా నిధులు

దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి, అక్టోబర్ 23

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను పురస్కరించుకుని ఆందోల్ నియోజకవర్గ స్థాయి అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చౌటకూర్ మండలం తద్దానపల్లిలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రహదారులు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాల, హాస్టళ్ల నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, కేజీబీవీలు, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు.సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, బస్సులు, అదనపు తరగతి గదులు, సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాల మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఆందోల్ స్టేడియం అభివృద్ధి, గిరిజన లా కళాశాల నిర్మాణం, నూతన పాఠశాల భవనాలతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు.జోగిపేట--ఆందోల్ పట్టణాలను అనుసంధానించే వంతెనల నిర్మాణం, సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిసర ప్రాంతాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, రవాణా సౌకర్యాల విస్తరణ, పర్యాటక రంగ అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నాయకులు, కార్యకర్తలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, పీసీసీ సభ్యుడు కిషన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జగన్‌మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మీ శేషారెడ్డి, ఆందోల్--జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.అలాగే వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పిల్లోడి సతీష్, దిగంబర్ రావు, శేషారెడ్డి, దుర్గారెడ్డి, గణేష్, కేదారనాథ్, వెంకటేశం, విశ్వాస్, విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్లు కచ్చూరు రావు, మల్లారెడ్డి, సర్పంచులు, కౌన్సిలర్లు, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కార్మిక సంఘాలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రికి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఢిల్లీ విమానాశ్రయంలో 3 గంటల పాటు నిర్బంధం..

కేంద్రంపై పంజాబ్ సీఎం తీవ్ర ఆరోపణలు



ఢిల్లీ, అక్టోబర్ 23: పారిస్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చిన తనను ఢిల్లీ విమానాశ్రయంలో దాదాపు మూడు గంటల పాటు ఆపడంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.కస్టమ్స్ చీఫ్‌పై ఆరోపణ: ఢిల్లీ విమానాశ్రయ కస్టమ్స్ అధికారి మనీష్ కుమార్, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు స్వయానా సొంత తమ్ముడని మాన్ ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా కక్ష సాధించడానికే అధికారులు ఈ వేధింపులకు పాల్పడ్డారని, తన ప్రతిష్టను దిగజార్చేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు.

పారిస్‌లో జరిగిన ఒక ఆహార మహోత్సవంలో పంజాబ్ మార్క్‌ఫెడ్ స్టాల్‌ను సందర్శించడానికి తనకు మొదట అనుమతి నిరాకరించారని, ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకున్న తర్వాతే తాను అక్కడికి వెళ్లగలిగానని మాన్ తెలిపారు.విమానాశ్రయంలో తనిఖీలు, చలానా: పారిస్ నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఢిల్లీ విమానాశ్రయంలో తన లగేజీని దాదాపు రెండు గంటల పాటు క్షుణ్ణంగా తనిఖీ చేశారని, కానీ ఎలాంటి అక్రమ వస్తువులు దొరకలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తనకు యాభై వేల రూపాయల జరిమానా (చలానా) విధించారని తెలిపారు.ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ, కేంద్ర ప్రభుత్వ ఒత్తిడి వల్లే అధికారులు ఇలా వ్యవహరించారని ఆరోపించింది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన నాయకులే నియంతలా వ్యవహరించే సరికొత్త ధోరణి దేశంలో కొనసాగుతోందని మాన్ విమర్శించారు.ప్రజాస్వామ్య సంస్థల బలహీనత ఎన్నికల ప్రక్రియ స్వతంత్రతను ప్రశ్నార్థకం చేస్తూ, దేశంలో కోట్ల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడే చరిత్ర పంజాబ్‌కు ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సమయాలకే ఈడీ, సీబీఐ వంటి కేంద్ర సంస్థలను రంగంలోకి దించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిని పట్టించుకోరని ఆరోపించారు. ఈ పరిణామాలన్నింటిపై విపక్షాల నుంచి కూడా విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి.

ఏపీకి తుపాను ముప్పు..



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశం ఉందని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఆగ్నేయ, తూర్పుమధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం శనివారం నాటికి వాయుగుండంగా, ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడే సూచనలు ఉన్నాయని తెలిపారు. సోమవారం నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారవచ్చని పేర్కొన్నారు. అనంతరం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని వివరించారు. సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే వెనక్కి రావాలని హెచ్చరించారు.అల్పపీడనం ప్రభావంతో శని, ఆదివారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం రాయలసీమలో అక్కడక్కడ వర్షాలు పడవచ్చని అధికారులు తెలిపారు. మంగళ, బుధవారాల్లో ఉత్తరాంధ్రతో పాటు కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని వెల్లడించారు. తీరం వెంబడి బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మంగళవారం విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు పడవచ్చని అంచనా. బుధవారం అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు జిల్లా దూదేకొండలో అత్యధికంగా 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దేవనకొండలో 52.1, నంద్యాల జిల్లా సంజామలలో 41.99, కర్నూలు జిల్లా లద్దగిరిలో 40.5, మొలగవల్లిలో 39.6, ఓర్వకల్లులో 39.2, నంద్యాల జిల్లా రామాపురంలో 35.5, తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగలో 35.2, పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో 35.1, ప్రకాశం జిల్లా ఉప్పుమాగులూరులో 34.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అత్యవసర సహాయం, తుపాను సమాచారానికి 112, 1070 లేదా 18004250101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచిం

సర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో మళ్లీ మొదలైన ఆందోళనలు.. పలువురు అరెస్ట్



ఢిల్లీ, సీఈసీకి, సర్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో ఆందోళనలు మళ్లీ మొదలయ్యాయి. కొందరు ఆందోళనకారులు శుక్రవారం సర్‌కు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సర్ పేరుతో ఓట్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. అయితే, వారిని ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. పలువురు నిరసనకారుల్ని అదుపులోకి తీసుకున్నారు.శుక్రవారం జరిగిన ఆందోళనలో పాల్గొనాల్సిందిగా నిర్వాహకులు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సహా పలువురు నేతల్ని ఆహ్వానించారు. పలువురు రైతులు, విద్యార్థులు, పౌర సంఘాల ఆధ్వర్యంలో.. ఢిల్లీలోని సాహిబ్ గురుద్వారా బంగ్లా నుంచి పటేల్ చౌక్ సమీపంలోని ఈసీఐ కార్యాలయం వరకు ఈ ర్యాలీ నిర్వహించాలని భావించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా.. అలాగే, ప్రజా స్వామ్యాన్ని పునరుద్ధరించాలి అనే డిమాండ్‌తో ఈ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆందోళన కారులు.. హర్ గలి జంతర్ మంతర్.. హర్ గావో జంతర్ మంతర్.. మేరా ఘర్ జంతర్ మంతర్ అంటూ నినదించారు.అయితే, ఆందోళనకారుల్ని ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నాయి. మరోవైపు ఢిల్లీలో ఆందోళనల్ని అదుపు చేసేందుకు కేంద్ర హోం శాఖ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే భారీ స్థాయిలో పోలీసులు, ఇతర భద్రతా బలగాల్ని మోహరించిన కేంద్రం.. ఇప్పుడు అదనంగా 273 సీఏపీఎఫ్ కంపెనీలను రంగంలోకి దించింది. అక్టోబర్ 31 వరకు వీరు ఢిల్లీలో సేవలందిస్తారు. ఈ నెల ప్రారంభం నుంచి వీరు ఇక్కడ పని చేస్తున్నారు. ముందుగా అక్టోబర్ 20 వరకే సీఏపీఎఫ్ బలగాల్ని ఉంచాలని భావించారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అక్టోబర్ 30 వరకు ఈ బలగాల్ని మోహరించనున్నారు.

పట్టుపరిశ్రమ విద్యతో ఉజ్వల భవిష్యత్తు..

ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కేయూ వేదిక



కాకతీయ యూనివర్సిటీ (పట్టుపరిశ్రమ (సెరికల్చర్) విద్యతో విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని కాకతీయ విశ్వవిద్యాలయ సెరికల్చర్ విభాగ ఆచార్యులు డాక్టర్ కే. సుజాత, డాక్టర్ కనీజ్ ఫాతిమా తెలిపారు. ఈ రంగంలో నైపుణ్యాలను పెంపొందిం చుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం 1990--91 విద్యా సంవత్సరం నుంచి సెరికల్చర్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సును అందిస్తోందని, 2022--23 విద్యా సంవత్సరం నుంచి ఎం.ఎస్సీ. సెరికల్చర్ కోర్సును ప్రారంభించిందని వివరించారు.

ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు పట్టుపరిశ్రమపై సమగ్ర అవగాహనతో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అందుతున్నాయని తెలిపారు. సెరికల్చర్ విద్యను అభ్యసించిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తి, అభివృద్ధి రంగాల్లో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్ర పట్టు బోర్డు పరిధిలోని ప్రీ-కోకూన్ విభాగంలో సైంటిస్ట్--బి వంటి ఉద్యోగాలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు ఈ విద్య దోహదపడుతుందని చెప్పారు.

దేశీయ పట్టు ఉత్పత్తి పెంపు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి సెరికల్చర్ విద్య కీలకమని, తద్వారా వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనకు తోడ్పడవచ్చని ఆచార్యులు అభిప్రాయ పడ్డారు. విద్యార్థులు కాకతీయ విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న సెరికల్చర్ కోర్సులపై అవగా హన పెంచుకొని, ఈ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

అమెరికాలో భార్యను హత్య చేసిన భారత సంతతి వ్యక్తి..



వాషింగ్టన్: అమెరికాలో నివసిస్తున్న భారత సంతతి వ్యక్తి తన భార్యను హత్య చేశాడు. అయితే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఏజెంట్లు ఆమెను అపహరించినట్లు అతడు ఆరోపించాడు. ఈ మేరకు పోలీసులకు అబద్ధం చెప్పాడు. అయితే ఆ వ్యక్తే తన భార్యను చంపినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడింది. (×అఒఱుఅ మీుఅ వీబతీఒవతీం ఔఱుటవ ×అ ఖూ) భారత సంతతికి చెందిన 28 ఏళ్ల గురిందర్ గిల్, 30 ఏళ్ల జాస్మిన్ గిల్ భార్యాభర్తలు. కాలిఫోర్నియాలోని శాక్రమెంటోలో నివసిస్తున్న ఈ దంపతులకు 8 నెలల కుమారుడు ఉన్నాడు.కాగా, సెప్టెంబర్ 30న శాక్రమెంటోలోని నివాసంలో చివరిసారిగా జాస్మిన్ కనిపించింది. నాలుగు రోజుల తర్వాత ఆమె అదృశ్యమైనట్లు బంధువు ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భర్త గురిందర్ గిల్‌ను పోలీసులు ప్రశ్నించారు. అయితే తన భార్య ఇంట్లో మెయిల్ చూస్తుండగా వలస నిబంధనల ఉల్లంఘనల అనుమానంతో ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు ఆమెను అదుపులోకి తీసుకుని తీసుకెళ్లారని పోలీసులకు అతడు చెప్పాడు.అయితే పోలీస్ అధికారులు ఐసీఈని సంప్రదించగా గురిందర్ అబద్ధం చెప్పినట్లు తేలింది. భార్య జాస్మిన్, అతడి మధ్య విడాకులు, పిల్లల సంరక్షణ హక్కుల వివాదం కొనసాగుతున్నట్లు వారు తెలుసుకున్నారు. అక్టోబర్ 1న, ఎల్ డొరాడో కౌంటీలో కాలిన మానవ అవశేషాలను పోలీసులు గుర్తించారు. ఆ అవశేషాలు జాస్మిన్‌వే అని నిర్ధారించారు. ఈ నేపథ్యంలో భర్త గురీందర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిపై హత్య కేసు నమోదు చేసిన తర్వాత అక్టోబర్ 14న అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

మరోవైపు జాస్మిన్ హత్య విషయం తెలుసుకున్న భారత్‌లోని ఆమె కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు.ఎనిమిది నెలల పసిబిడ్డకు తల్లి అయిన ఆమె జీవితం 30 ఏళ్లకే ముగిసిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. జాస్మిన్ చిన్న వయసులోనే తన తండ్రిని కోల్పోయిదని భారత్‌లో నర్సుగా పనిచేస్తున్న ఆమె తల్లి సుఖ్వీందర్ కౌర్ తెలిపారు. తన కుమార్తెను ఆమె భర్త ఎంతో క్రూరత్వానికి గురిచేసినట్లు ఒక వీడియోలో ఆమె ఆరోపించారు.



స్విగ్గీ, జొమాటోకు పోటీగా ఫ్లిప్‌కార్ట్..

ఆగస్టు 15 నుంచి ఫుడ్ డెలివరీ రంగంలోకి..

ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ త్వరలో ఆహార డెలివరీ రంగంలోకి కూడా అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్, క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న సంస్థ ఆగస్టు 15వ తేదీ నుంచి బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది.ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ త్వరలో ఆహార డెలివరీ రంగంలోకి కూడా అడుగుపెట్టనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ షాపింగ్, క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న సంస్థ ఆగస్టు 15వ తేదీ నుంచి బెంగళూరులో పైలట్ ప్రాజెక్ట్‌గా ఫుడ్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం దేశంలో ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో జొమాటో, స్విగ్గీ ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఇటీవల రాపిడో కూడా 'ఓన్లీ' పేరుతో ఈ రంగంలోకి ప్రవేశించగా, ఇప్పుడు ఫ్లిప్‌కార్ట్ కూడా పోటీకి సిద్ధమవుతోంది
ప్రస్తుతం జొమాటో, స్విగ్గీలు రెస్టారెంట్లు, హోటళ్ల నుంచి 16 నుంచి 30 శాతం వరకు కమిషన్ వసూలు చేస్తున్నాయి. అయితే ఫ్లిప్‌కార్ట్ మాత్రం రెస్టారెంట్ల నుంచి సుమారు 10 శాతం కమిషన్ మాత్రమే వసూలు చేయాలని యోచిస్తోంది. తక్కువ కమిషన్‌తో ఎక్కువ రెస్టారెంట్లను ఆకర్షించాలన్న వ్యూహాన్ని సంస్థ అమలు చేస్తోంది. మొదటి దశలో బెంగళూరులో సేవలను ప్రారంభించిన తర్వాత వినియోగదారుల స్పందనను బట్టి ఇతర నగరాలకూ విస్తరించాలని ఫ్లిప్‌కార్ట్ ప్రణాళిక రూపొందించింది ఫుడ్ డెలివరీ విభాగం కోసం ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేకంగా మరో యాప్‌ను తీసుకురాబోతోంది. (ఖీశ్రీఅజూఎఖీ ూబస్త్రబర్ 15 శ్రీఖబఅఎష్ట్ర). ఇప్పటికే రెస్టారెంట్లను భాగస్వాములుగా చేర్చే ప్రక్రియ వేగంగా కొనసాగుతున్నట్లు సమాచారం. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ పెరిగితే వినియోగదారులకు మెరుగైన ఆఫర్లు, తక్కువ డెలివరీ ఛార్జీలు లభించే అవకాశం ఉంది. అదే సమయంలో రెస్టారెంట్లకు కూడా తక్కువ కమిషన్ కారణంగా అదనపు ప్రయోజనం చేకూరే అవకాశముంది.

ఐటీ రిటర్నులు ఈ-వెరిఫై చేసుకోండిలా..



ఐటీ రిటర్నుల ఫైలింగ్ ముగిసింది. ఇప్పటికే చాలా మంది తమ రిటర్నులు ఫైల్ చేసి ఉంటారు. అయితే మనం ఫైల్ చేసిన రిటర్న్ సరిగా ఉందా? లేదా? ఏమైనా తప్పులు ఉన్నాయి? అనే విషయాలను ఎలక్ట్రానిక్ (ఈ)-వెరిఫై చేసుకోవాల్సిన అవసరం ఉంది. రిటర్న్ ఫైల్ చేసిన నెల రోజుల లోపు ఈ-వెరిఫై పూర్తి చేయాలి. తప్పొప్పులు, తేడాలు ఉంటే వాటిని సవరించి నెల రోజుల లోపు మళ్లీ ఫైల్ చేయాలి. ఒకవేళ మీ రిటర్నులో తప్పులు, పొరపాట్లు ఉంటే ఐటీ శాఖ..ఆ రిటర్న్‌ను ఇన్‌వ్యాలిడ్ లేదా ఇన్‌కంప్లీట్ జాబితాలో పెట్టే ప్రమాదం ఉంది. అదే జరిగితే మీకు రావలసిన రిఫండ్ ప్రాసెస్ ప్రక్రియ కూడా ఆలస్యమవుతుంది.
ఈ-వెరిఫికేషన్ ఎలా?
ముందుగా ఈ-ఫైలింగ్ పోర్టల్ అఅఎశీఎఱుఱ.స్త్రశీజ.అఅ కు వెళ్లి 'ఈ-వెరిఫై రిటర్న్'పై క్లిక్ చేయాలి.
తరువాత మీ పాన్ నంబరు, అసెస్‌మెంట్ ఇయర్, అక్‌నాలెడ్జ్‌మెంట్ నంబరు ఎంటర్ చేయాలి.ఒకవేళ అన్ని వివరాలు లేకపోతే పాన్ నంబరు, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయి 'మై అకౌంట్'లోకి వెళ్లి 'ఈ-వెరిఫై రిటర్న్'పై క్లిక్ చేయాలి.

అల్యూమినియం ఫాయిల్‌లో ఉంచిన ఆహారాలను తింటున్నారా.. అయితే జాగ్రత్త..



అల్యూమినియం ఫాయిల్ ప్రస్తుతం ప్రతి ఇంట్లో కనిపించే వంటింటి వస్తువుగా మారింది. భోజనం ప్యాక్ చేయడం, గ్రిల్ చేసిన చేపలు, చికెన్, కూరగాయలు వండడం వంటి అనేక పనులకు దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అయితే అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు ఉంచడం లేదా అందులోనే వండడం వల్ల కొంత అల్యూమినియం ఆహారంలోకి చేరే అవకాశం ఉంటుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా పుల్లని, మసాలా ఎక్కువగా ఉండే ఆహారాల విషయంలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అల్యూమినియం పాత్రలను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ఇవి తక్కువ ధరలో లభించడం, శుభ్రం చేయడం సులభం కావడం వల్ల చాలామంది వీటినే ఎంచుకుంటున్నారు. సాధారణంగా అల్యూమినియం పాత్రల్లో వంట చేయడం వల్ల పెద్దగా ప్రమాదం ఉండదని భావించినప్పటికీ, అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు చుట్టి ఉంచడం మాత్రం ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఏం జరుగుతుంది..

అల్యూమినియం స్వల్ప పరిమాణంలో శరీరంలోకి వెళ్లినా సాధారణంగా అది శరీరం నుంచి బయటకు వెళ్లిపోతుంది. అందువల్ల తక్కువ స్థాయిలో దీనికి గురికావడం పెద్దగా హానికరం కాదు. అయితే చాలామంది సిఫార్సు చేసిన పరిమితికి మించి అల్యూమినియాన్ని పరోక్షంగా తీసుకుంటున్నారని పరిశోధనలు సూచిస్తున్నాయి. మొక్కజొన్న, ఉప్పు, పసుపు రంగు చీజ్‌లు, కొన్ని మూలికలు, మసాలా దినుసులు, టీ వంటి పదార్థాల్లో కూడా అల్యూమినియం కొంతమేర ఉంటుంది. తాగునీటిని శుద్ధి చేయడానికి ఉపయోగించే అల్యూమినియం సల్ఫేట్ కూడా దీనికి ఒక ఉదాహరణ. కొన్ని పరిశోధనల్లో అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న వారి మెదడు కణజాలంలో అల్యూమినియం స్థాయిలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే అల్యూమినియం మెదడు కణాల ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని, ఎముకల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారిలో సమస్యలను మరింత పెంచే అవకాశాలు ఉంటాయని కొన్ని అధ్యయనాలు తెలియజేశాయి.

ఈ ఆహారాలతో ఇంకా అధికం..

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లూహెచ్ఓ) తెలిపిన ప్రకారం అల్యూమినియం ఫాయిల్‌లో వండిన ఆహారంలో అల్యూమినియం అనుమతించిన పరిమితిని మించి చేరే అవకాశం ఉందని వెల్లడైంది. ముఖ్యంగా టమాటా, నిమ్మరసం, వెనిగర్ వంటి పుల్లని పదార్థాలు లేదా మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాల్లో ఈ ప్రక్రియ మరింత వేగంగా జరుగుతుంది. ఆమ్ల స్వభావం కలిగిన ఆహారం అల్యూమినియం పొరను కరిగించి ఆహారంలో కలిసేలా చేస్తుంది. బేక్ చేసే వంటకాల కోసం అల్యూమినియం ఫాయిల్‌కు బదులుగా గాజు (గ్లాస్‌వేర్) లేదా పింగాణీ (పోర్సిలైన్) పాత్రలను ఉపయోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఆహారంతో రసాయనిక ప్రతిచర్యలకు గురయ్యే అవకాశం తక్కువగా ఉండటంతో సురక్షితమైన ప్రత్యామ్నాయాలుగా చెబుతున్నారు.
చల్లని ఆహారాన్ని అల్యూమినియం ఫాయిల్‌లో చుట్టి ఉంచడం సాధారణంగా సురక్షితమే అయినప్పటికీ, అది కూడా ఎక్కువసేపు ఉంచకూడదు. ఆహారం ఎంత పుల్లగా లేదా మసాలా ఎక్కువగా ఉంటే అంతే వేగంగా అల్యూమినియం అందులోకి చేరే అవకాశం ఉంటుంది.

అల్యూమినియం పాత్రల సంగతేంటి..

అల్యూమినియం పాత్రల విషయానికి వస్తే.. వాటి ఉపరితలంపై సహజంగా ఏర్పడే ఆక్సైడ్ పొర ఆహారంలోకి అల్యూమినియం చేరకుండా కొంత రక్షణ కల్పిస్తుంది. అయితే పాత్రలను గట్టిగా రుద్ది శుభ్రం చేయడం వల్ల ఈ రక్షణ పొర తొలగిపోయే అవకాశం ఉంటుంది. అలాంటి సందర్భాల్లో పాత్రలో కొద్దిసేపు నీటిని మరిగించడం ద్వారా మళ్లీ సహజ ఆక్సైడ్ పొర ఏర్పడి రక్షణ కల్పిస్తుంది. అందువల్ల అల్యూమినియం ఫాయిల్‌లో ఆహారాన్ని ఎక్కువసేపు నిల్వ చేయకుండా ఉండటం మంచిది. ముఖ్యంగా పుల్లని, మసాలా ఎక్కువగా ఉండే ఆహారాలను అల్యూమినియం ఫాయిల్‌లో వండడం లేదా ఎక్కువసేపు చుట్టి ఉంచడం ఆరోగ్యానికి హానికరంగా మారే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు

వయస్సు పెరిగే కొద్దీ తగ్గే మెటబాలిజం..

దీన్ని పెంచుకోవాలంటే ఏం చేయాలి..?



వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలోని జీవక్రియల (మెటబాలిజం) వేగం సహజంగానే తగ్గుతుంది. చిన్నతనంలో సులభంగా జీర్ణమయ్యే ఆహారం, పెరుగుతున్న వయసులో అంత తేలికగా జీర్ణం కాకపోవడంతోపాటు బరువు కూడా త్వరగా పెరిగే అవకాశం ఉంటుంది. నిద్రలేమి, ధూమపానం, మద్యం సేవించడం, శారీరక శ్రమ లేకపోవడం వంటి అలవాట్లు కండరాల పరిమాణాన్ని తగ్గించి మెటబాలిజాన్ని మరింత మందగింపజేస్తాయి. అయితే కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా జీవక్రియల వేగాన్ని మెరుగుపరచుకోవచ్చు. కారంగా ఉండే ఆహారం తీసుకోవడం మెటబాలిజాన్ని పెంచడంలో కొంతవరకు సహాయపడుతుందని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. మిరపకాయల్లో ఉండే క్యాప్సైసిన్ అనే పదార్థం కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారం వల్ల వచ్చే అదనపు బరువును తగ్గించడంలో ఉపయోగపడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఒక గ్రాము మిరపకాయ ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మరో అధ్యయనం ప్రకారం ఐదు గ్రాముల మిరపకాయలు తీసుకోవడం వల్ల సుమారు 30 నిమిషాల పాటు మెటబాలిజం దాదాపు 20 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని తేలింది.

కార్డియో వ్యాయామాలు, ప్రోటీన్లు..

కార్డియో వ్యాయామాలు కేలరీలను కరిగించడంలో ఉపయోగపడితే, వెయిట్ ట్రైనింగ్ కండరాల పరిమాణాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కొవ్వుతో పోలిస్తే కండరాలు ఎక్కువ కేలరీలను ఖర్చు చేస్తాయి. వృద్ధులపై నిర్వహించిన ఒక అధ్యయనంలో 16 వారాల పాటు రెసిస్టెన్స్ ట్రైనింగ్ చేయడం వల్ల శరీరంలోని కొవ్వు తగ్గడంతోపాటు మెటబాలిజం కూడా మెరుగుపడినట్లు గుర్తించారు. కొన్ని పరిశోధనల్లో ఈ వ్యాయామం మహిళల్లో మరింత ప్రభావవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం కూడా మెటబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రోటీన్ కండరాల నిర్మాణాన్ని, సంరక్షణను ప్రోత్సహిస్తుంది. దీంతో శరీరం విశ్రాంతి సమయంలో కూడా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసే అవకాశం ఉంటుంది. ప్రోటీన్లను ఎక్కువగా తీసుకునే వారిలో విశ్రాంతి సమయంలో జీవక్రియల వేగం అధికంగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అల్పాహారాన్ని కచ్చితంగా తీసుకోవాలి..

ఉదయం అల్పాహారాన్ని ఎప్పుడూ మానేయకూడదు. ముఖ్యంగా ప్రోటీన్ అధికంగా ఉండే పోషకాహారం తీసుకోవడం వల్ల రోజంతా అనవసరంగా చిరుతిండ్లు తినాలనే కోరిక తగ్గుతుంది. మధ్య మధ్యలో తీసుకునే చిరుతిండ్లలో ఎక్కువగా చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే అవకాశం ఉంటుంది. బ్రిటన్‌లో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం నిద్రలేచిన రెండు గంటలలోపు అల్పాహారం తీసుకునే వారు రోజంతా ఎక్కువ కేలరీలను ఖర్చు చేసే అవకాశం ఉంటుందని వెల్లడైంది. తగినంత నీరు తాగడం కూడా మెటబాలిజాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.
నీరు శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడంతోపాటు కడుపు నిండిన భావన కలిగించి అతిగా తినకుండా చేస్తుంది. ముఖ్యంగా చల్లని నీటి కంటే గోరువెచ్చని లేదా గది ఉష్ణోగ్రతలో ఉండే నీటిని తాగడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

బరువు పెరుగుతామనే భయం ఉందా..



బరువు పెరుగుతామనే భయంతో చాలామంది కొన్ని ఆహారాలను పూర్తిగా దూరం పెడుతుంటారు. అయితే అన్ని ఆహారాలు ఒకేలా ఉండవు. జీరో కేలరీ ఆహారాలు అంటూ ఏవీ లేకపోయినా, కొన్ని ఆహారాల్లో పీచు (ఫైబర్), ప్రోటీన్ ఎక్కువగా ఉండటం వల్ల అవి ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో ఆకలి తగ్గి, మొత్తంగా తీసుకునే కేలరీల పరిమాణం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను కూడా అందిస్తాయి.
ఉడికించిన బంగాళాదుంపలను చాలామంది అధిక కార్బోహైడ్రేట్లు ఉన్నాయని దూరం పెడతారు. కానీ ఉడికించిన బంగాళాదుంపలు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారం. ఇవి ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగించే ఆహారాల్లో అగ్రస్థానంలో ఉంటాయి. సహాయపడుతుంది. ఉడికించిన బంగాళాదుంపలను చల్లార్చి మళ్లీ వేడి చేసి తింటే రెసిస్టెంట్ స్టార్చ్ పరిమాణం పెరిగి మరింత ప్రయోజనం కలిగించే అవకాశం ఉంటుంది.

కోడిగుడ్లు, చేపలు..

గుడ్లు శరీరానికి అవసరమైన దాదాపు అన్ని కీలక పోషకాలను అందించే ఆహారం. ఒక గుడ్డులోని ప్రోటీన్‌లో సగం వరకు పచ్చసొనలోనే ఉంటుంది. గుడ్లు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం ఉదయం అల్పాహారంగా గుడ్లు తిన్నవారు రోజంతా తక్కువ కేలరీలు తీసుకున్నట్లు, కూడా ఇతరులతో పోలిస్తే తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. చేపల్లో ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు, అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి.

పండుగ వేళ ఎథ్నిక్ లుక్‌లో పూజా హెగ్డే.. గ్లామర్ డోస్ అదుర్స్! స్లీవ్‌లెస్



పండుగ వేళ ఎథ్నిక్ లుక్‌లో పూజా హెగ్డే.. గ్లామర్ డోస్ అదుర్స్! టాలీవుడ్, బాలీవుడ్‌లలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకెళ్తున్న పూజా హెగ్డే ఫ్యాషన్ ట్రెండ్స్‌ను సెట్ చేయడంలో ఎప్పుడూ ముందే ఉంటారు. తనదైన గ్లామర్, స్టైలిష్ లుక్స్‌తో ఎంతోమంది డిజైనర్లకు మ్యూజ్‌గా మారిన ఈ బుట్టబొమ్మ ఏ దుస్తులు వేసినా దానికి మరింత అందాన్ని తీసుకువస్తారు. తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఒక గ్రాండ్ ఈవెంట్‌లో పాల్గొన్న పూజా హెగ్డే, తన ఎథ్నిక్ ఫ్యాషన్ సెన్స్‌తో మళ్లీ అందరి దృష్టిని ఆకర్షించారు. ఆ ఫెస్టివ్ వేడుక విశేషాలు ఇప్పుడు చూద్దాం..

ూశ్రీంశీ =ముఎ - ఆస్ట్రేలియా వీధుల్లో స్టైలిష్‌గా కయాదు లోహర్.. ఫ్యాన్స్ ఫిదా!

హైదరాబాద్‌లో లైఫ్‌స్టైల్ ఫెస్టివ్ కలెక్షన్ లాంచ్: హైదరాబాద్‌లో లైఫ్‌స్టైల్ స్టోర్స్ నూతన బ్రాంచ్‌లు ప్రారంభమయ్యాయి. ఈ స్టోర్స్ ఓపెనింగ్ ఈవెంట్‌లో పాల్గొన్న పూజా హెగ్డే.. లైఫ్‌స్టైల్ యొక్క స్పెషల్ ఫెస్టివ్ కలెక్షన్' ఎథ్నిక్ వైబ్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఇక ఈ పండుగ సీజన్‌కు తగ్గట్టుగా రూపొందించిన రకరకాల డిజైనర్ కుర్తీలు, పండుగ దుస్తులు, రాయల్ పాదరక్షలు మరియు ట్రెండీ క్లచ్‌లను ఆమె ఆవిష్కరించి సందడి చేశారు. ఎథ్నిక్ ఫ్యూజన్ సెట్‌లో అదరగొట్టిన బుట్టబొమ్మ: ఈవెంట్‌లో పూజా హెగ్డే ధరించిన టు-పీస్ ఎథ్నిక్ ఫ్యూజన్ అవుట్‌ఫిట్ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. స్లీవ్‌లెస్ క్యారెక్టర్‌తో కాలర్-నెక్ ఎంబ్రాయిడరీ వేస్ట్‌కోట్ బ్లౌజ్, దానికి మ్యాచింగ్ ఎంబ్రాయిడరీ మ్యాక్సీ స్కర్ట్ జత చేసి ఆమె చాలా రాయల్‌గా కనిపించారు. బ్లాక్ ఫ్లోరల్ డిజైన్ డ్రెస్‌లో ఆమె చూపిన గ్లామర్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

'418' మూవీ రివ్యూ..

ప్రశాంత్ నీల్ హారర్ సినిమా భయపెట్టిందా?

నటీనటులు : చైత్ర ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ తదితరులు
సంగీతం : వెంకీ జీజీ
నిర్మాతలు : నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్
రచన, దర్శకత్వం : కీర్తన్ నాదగౌడ
సమర్పణ : ప్రశాంత్ నీల్
బ్యానర్ : మైత్రి మూవీ మేకర్స్
విడుదల తేదీ : 23 అక్టోబర్ 2026

ప్రశాంత్ నీల్ సమర్పణలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో కీర్తన్ నాదగౌడ తెరకెక్కించిన సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ '418'. ప్రశాంత్ నీల్ శిష్యుడు దర్శకత్వం వహించడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరి ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు భయపెట్టిందో రివ్యూలో చూద్దాం.

కథ

ఊరికి దూరంగా ఉన్న ఓ మెడికల్ కాలేజ్ హాస్టల్‌ను 15 ఏళ్ల తర్వాత తిరిగి తెరుస్తారు. అయితే అందులోని '418' గది మాత్రం ఎప్పటికీ మూసే ఉంటుంది. ఆ గది గురించి తలచుకుంటేనే విద్యార్థులు వణికిపోతుంటారు. ఈ క్రమంలో హాస్టల్‌లోని 417వ గదిలో చేరిన వివేక్ (సూర్య రాజ్)కు వింత అనుభవాలు ఎదురవుతాయి. పీడకలలు, భయంకరమైన దృశ్యాలు అతన్ని వెంటాడుతుంటాయి. తనపై హత్యాయత్నం కూడా జరగడంతో, వీటన్నింటికీ 418వ గదినే కారణమని తెలుసుకుంటాడు. అసలు ఆ గది వెనక ఉన్న రహస్యం ఏంటి? లండన్ నుంచి వచ్చిన సాయేషా (ప్రీతి పగడాల) ఆ గదిని తెరవడానికి ప్రయత్నించినప్పుడు ఏం జరిగింది? అనేది అసలు కథ.

విశ్లేషణ

హారర్ సినిమాల్లో సాధారణంగా కనిపించే మూతపడిన బంగ్లా, ఆత్మ, పాత నేపథ్యం వంటి పాత ఫార్ములానే ఈ చిత్రంలోనూ ఎంచుకున్నారు. కథాకథనంలో పెద్దగా కొత్తదనం కనిపించకపోయినా, దర్శకుడు కీర్తన్ నాదగౌడ సృష్టించిన భయానక వాతావరణం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

సాంకేతిక విభాగం: వెంకీ జీజీ అందించిన నేపథ్య సంగీతం వెన్నులో వణుకు పుట్టిస్తుంది. విజువల్స్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి. యక్షగానం కళా రూపం మరియు కథలోని సైకలాజికల్ కోణం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి.

నటన: కన్నడ నటి చైత్ర ఆచార్ తన అద్భుతమైన నటనతో సినిమాను తన భుజాన వేసుకున్నారు. సూర్య రాజ్, ప్రీతి పగడాల, చరణ్ లక్కరాజు తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. కొత్త నటులు కావడంతో సినిమాకు సహజత్వం వచ్చింది.

బలాలు
దేవిక పాత్ర చుట్టూ నడిచే ద్వితీయార్ధం
భయపెట్టే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ మరియు సినిమాటోగ్రఫీ
చైత్ర ఆచార్ అభినయం
ఆసక్తికరమైన ప్రారంభ సన్నివేశాలు

బలహీనతలు
రొటీన్ కథ మరియు కొత్తదనం లేని స్క్రీన్ ప్లే
క్లైమాక్స్

చివరిగా.. కొన్ని అంచనాలతో థియేటర్లకు వెళ్లే హారర్ జోనర్ ప్రేక్షకులను '418' అక్కడక్కడా మంచి అనుభూతిని పంచుతుంది. భయపెట్టే సన్నివేశాలు కోరుకునేవారికి ఇది పర్ఫెక్ట్ ఛాయిస్!



ప్రభాస్ బర్త్‌డే స్పెషల్..

'స్పిరిట్' సెట్స్ నుంచి సందీప్ రెడ్డి వంగా సర్‌ప్రైజ్ పోస్ట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, సినీ ప్రముఖులు ఆయనకు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. తమ అభిమాన హీరో పుట్టినరోజు కావడంతో ప్రభాస్ కొత్త సినిమాల నుంచి ఏదైనా ప్రత్యేక ప్రకటన వస్తుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ క్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా అభిమానులకు ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చారు. ప్రభాస్‌తో కలిసి 'స్పిరిట్' సినిమా సెట్స్‌లో దిగిన ఫొటోను పంచుకుంటూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభాస్‌తో సందీప్ రెడ్డి వంగా కలిసి ఉన్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో సందీప్ రెడ్డి వంగా చేతిలో మందు బాటిల్ పట్టుకుని ఉండగా, ప్రభాస్ నవ్వుతూ దానిని చూపిస్తూ ఆయనతో మాట్లాడుతున్నట్లు కనిపిస్తున్నారు. ఈ ఫొటోను పంచుకున్న సందీప్ రెడ్డి వంగా.. "అన్నా.. లెట్స్ పార్టీ! ఇవాళ నీ పుట్టినరోజు. పుట్టినరోజు శుభాకాంక్షలు ప్రభాస్ అన్నా" అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు.ప్రభాస్‌తో సందీప్‌కు ఉన్న సాన్నిహిత్యాన్ని ఈ ఫొటో ప్రతిబింబిస్తోందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. తమ అభిమాన హీరో పుట్టినరోజున దర్శకుడు పంచుకున్న ఈ ప్రత్యేక ఫొటోను విపరీతంగా షేర్ చేస్తున్నారు.ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కలయికలో తెరకెక్కనున్న 'స్పిరిట్' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి చిత్రాలతో తనదైన శైలిని చాటుకున్న సందీప్.. ప్రభాస్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.



40 ఏళ్ల నిరీక్షణకు తెర పడనుందా

సినిమా ప్రపంచంలో మల్టీస్టారర్ చిత్రాలకు ఉండే క్రేజ్ ప్రత్యేకం. అందులోనూ సూపర్‌స్టార్ రజినీకాంత్, విశ్వనటుడు కమల్ హాసన్ కలిసి నటిస్తే అభిమానుల ఆనందానికి హద్దులుండవు. దశాబ్దాలుగా తమదైన నటన, ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ఇద్దరు దిగ్గజ నటులు మరోసారి ఒకే తెరపై కనిపించబోతున్నారనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ పేరు వినిపిస్తుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. కాగా, రజినీకాంత్, కమల్ హాసన్‌లకు తమిళ చిత్ర పరిశ్రమలో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. 1975లో విడుదలైన 'అపూర్వ రాగంగళ్'తో రజినీకాంత్ వెండితెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత 'అంతులేని కథ', 'మూండ్రు ముడిచు', '16 వయతినిలే', 'అవర్గళ్', 'ఇళమై ఊంజలాడుకిరతు' వంటి పలు చిత్రాల్లో వీరిద్దరూ కలిసి నటించారు. కొన్ని సినిమాల్లో ఒకరు మరొకరి చిత్రంలో ప్రత్యేక పాత్రల్లోనూ కనిపించారు.కాలక్రమేణా ఇద్దరూ తమకంటూ ప్రత్యేకమైన అభిమానగణాన్ని సంపాదించుకున్నారు. రజినీకాంత్ తనదైన శైలి, తెరపై వినూత్నమైన అభినయంతో ప్రేక్షకులను అలరిస్తే.. కమల్ హాసన్ వైవిధ్యమైన పాత్రలు, ప్రయోగాత్మక చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే ఇద్దరూ కలిసి పూర్తిస్థాయిలో నటించే అవకాశం కోసం అభిమానులు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ ఈ ఇద్దరు దిగ్గజాలను ఒకే సినిమాలో చూపించనున్నారనే వార్త ఇప్పుడు చర్చనీయాంశమైంది.

బాక్సాఫీస్ డౌన్.. కాస్ట్ ఆఫ్ సెక్యూరిటీ అప్:

గండంలో స్టార్ హీరో మార్కెట్!

బాక్సాఫీస్ డౌన్.. కాస్ట్ ఆఫ్ సెక్యూరిటీ అప్: గండంలో స్టార్ హీరో మార్కెట్! బాలీవుడ్‌లో దశాబ్దాలుగా తిరుగులేని బాక్సాఫీస్ సామ్రాజ్యాన్ని ఏలిన భాయ్‌జాన్ సల్మాన్ ఖాన్ కెరీర్ ప్రస్తుతం అత్యంత సవాలుతో కూడిన మలుపులో పడింది. ఒకప్పుడు సింగిల్ హ్యాండ్‌తో రికార్డులను బద్దలు కొట్టిన స్టార్ హీరో, ఇప్పుడు బాక్సాఫీస్ ఫలితాలకే



పరిమితం కాకుండా ఊహించని భద్రతా సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు. ఈ సరికొత్త పరిణామాల నేపథ్యంలో బాలీవుడ్ నిర్మాతలలో వ్యక్తమవుతున్న ఆలోచనా ధోరణి.. సినిమా ఇండస్ట్రీలో నూతన చర్చకు తెరలేపింది. ూశ్రీంశీ =ముఎ - ఆస్ట్రేలియా వీధుల్లో స్టైలిష్‌గా కయాదు లోహర్.. ఫ్యాన్స్ ఫిదా! సల్మాన్ ఖాన్ గత సినిమాలైన -కిసీ కా భాయ్ కిసీ కీ జాన్-.. అలాగే ఇటీవలి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడం ఆయన మార్కెట్ పై కొంత ప్రభావాన్ని చూపింది. కేవలం స్టార్ డమ్ ఉంటే సరిపోదని.. నేటి ప్రేక్షకుల రుచికి తగినట్లుగా బలమైన కంటెంట్ కూడా ఉండాలని ఈ ఫలితాలు నిరూపించాయి. ఈ నేపథ్యంలో నిర్మాతలు ఆయనతో కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించే విషయంలో పునరాలోచనలో పడటం గమనార్హం. ఈ బాక్సాఫీస్ ఆందోళనల కంటే ఎక్కువగా? సల్మాన్ ఖాన్ చుట్టూ అల్లుకున్న భద్రతా సమస్యలు చిత్ర పరిశ్రమను కలవరపెడుతున్నాయి.